సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం : 22 : జూలై : 2023

న్యూస్‌రీల్

బ్యాంక్ లింకేజి రుణాలు సద్వినియోగం

● జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



బ్యాంక్ లింకేజి రుణాల చెక్కును అందజేస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన బ్యాంకు లింకేజి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కోరారు.చింతపల్లి మండలంలోని 67 స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి 87లక్షల 81వేలు విలువైన బ్యాంకు లింకేజి రుణాల నమూనా చెక్కును ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి శుక్రవారం ఐటీడీఏలో అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, డీఆర్‌డీఏ పీడీ మురళి, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 7,716 ధ్రువపత్రాల పంపిణీ

● కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 13 మండలాల పరిధిలో 20 గ్రామ సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.15,113 గృహాల నుంచి వలంటీర్లు వివిధ ధ్రువపత్రాల నిమిత్తం యాప్‌లలో నమోదు చేశారని తెలిపారు. 16,240 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా,7,716 ధ్రువపత్రాలను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. 21 దరఖాస్తులు తిరస్కరించగా, మిగిలిన ధ్రువపత్రాలను రెండు మూడు రోజుల్లో ఆయా సచివాలయాల సిబ్బంది,వలంటీర్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

నేడు ఐదు చోట్ల శిబిరాలు

జగనన్న సురక్ష పథకం శిబిరాలను శనివారం ఐదు గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.అనంతగిరి మండలం పినకోట, టోకూరు, హుకుంపేట మండలంలోని బూర్జ, సూకూరు, వై.రామవరంలో ఎర్రంరెడ్డిపాలెం సచివాలయాల్లో జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సప్పర్ల వార్డెన్ సరెండర్

● విధుల పట్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు



పూర్తి స్థాయిలో సరుకులు సమకూర్చిన ఎటీడబ్ల్యూవో జయలక్ష్మి

గూడెంకొత్తవీధి: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ సాగిన సత్యనారాయణను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రభుత్వానికి సరెండర్ చేసినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఎటువంటి సరకులు లేకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులకు సరియైన భోజనం అందడం లేదని ఆయన తెలుసుకున్నారు. ఇందుకు కారణమైన వార్డెన్ సాగిన సత్యనారాయణను సరెండర్ చేశారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా భోజనం అందించాలని ఏటీడబ్ల్యూవో జయలక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు అవసరమైన కూరగాయలు, సరకులను ఆమె ఆశ్రమ పాఠశాలలో అందుబాటులోకి తెచ్చారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

మారేడుమిల్లి : ఇంజనీరింగ్‌లో మెకానికల్, ఈసీఈ పూర్తి చేసిన గిరిజన, గిరిజనేతర యువతీ యువకులకు ప్రభుత్వం కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఆటోమొబైల్, ఆటోమేషన్, రోబోటిక్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ కోర్స్‌లకు ఆధునాతన పరిజ్ఞానంతో నాలుగు నెలలు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు మండల మహిళ సమాఖ్య ఏపీయం కె. శ్యాంబాబు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుందన్నారు. శిక్షణా అనంతరం మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9010151345, 7981349691 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

శాంతించిన నది

రెండురోజులపాటు విలీన మండలాల ప్రజలను ఆందోళనకు గురిచేసిన గోదావరి, శబరి నదులు ఎట్టకేలకు శాంతించాయి. బుధవారం అర్ధరాత్రి వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి తెల్లవారుజామునుంచి తగ్గుముఖం పట్టింది. ఉదయం నుంచి మళ్లీ స్వల్పంగా పెరిగిన గోదావరి మధ్యాహ్నం నుంచి తగ్గడం ప్రారంభించింది. కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో బుధవారం సాయంత్రం వరకు పెరిగిన నీటిమట్టం తరువాత క్రమేపీ తగ్గుముఖం పట్టింది. గోదావరి ఉధృతికి ఎగపోటుకు గురైన శబరినది కూడా బుధవారం సాయంత్రం వరకు పెరుగుతూ అక్కడినుంచి తగ్గడం కనిపించింది.



కూనవరం, భద్రాచలం రహదారిపై పోలిపాక వద్ద రోడ్డుపైకి పోటెత్తిన వరదనీరు

- గోదావరి, శబరి నీటిమట్టాలు **తగ్గుముఖం**
- రహదారులను ముంచెత్తిన **వరదనీరు**
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

చింతూరు: నదుల్లో వరద ఉధృతి తగ్గుతున్నా ఎగపోటుకు గురైన వాగుల వరదనీరు ఇంకా రహదారులపైనే ఉండటంతో వరుసగా రెండోరోజు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి–326 నీటమునిగి ఉండటంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు జరగలేదు. సోకిలేరు, అన్నవరం, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగుల వరదనీరు కారణంగా చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని 25 గ్రామాలకు రాకపోకలకు అవరోధం ఏర్పడింది.

మళ్లీ పెరిగే అవకాశం

ప్రస్తుతం వరద తగ్గుముఖం పడుతున్నా మళ్లీ పెరిగే అవకాశం ఉందని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గోదావరి, శబరి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, తెలంగాణలోని ప్రాజెక్టుల నీటితో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి వచ్చే వర్షపు నీటితో నదుల్లో నీటిమట్టం పెరగవచ్చని వారు పేర్కొన్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

వరద ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలపై వారు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో చర్చించారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో ఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ పాల్గొన్నారు.

వీఆర్‌పురం: శబరి– గోదావరి నదుల నీటిమట్టాల స్థాయి నిలకడగా ఉండటంతో వరద బాధితులు ఊపిరిపీల్చుకున్నారు.



వీఆర్‌పురం ప్రాంతంలో బ్రిడ్జిని ఆనుకొని ప్రవహిస్తున్న శబరి నది

● కన్నాయిగూడెం–చింతరేవుపల్లి గ్రామాల మధ్య రహదారిని వరద నీరు సుమారు కిలోమీటరుకు పై ముంచెత్తింది. కాగా గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకుగాను అధికారులు మరపడవలను ఏర్పాటు చేశారు. రాకపోకలు నిలిచిపోయిన పలు గ్రామాల వద్ద పడవలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ ఎస్.శ్రీధర్ తెలిపారు.ఎంపీడీవో రత్నకుమారి, ఎస్‌ఐ తెల్లం దుర్గాప్రసాద్ వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి అప్రమత్తం చేస్తున్నారు.

పూర్తిగా మునిగిన ఆలయం

దేవీపట్నం: ఎగువ ప్రాంతాల నుంచి ఉధృతంగా వస్తున్న వరదనీటి కారణంగా గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దేవీపట్నం మండలం పూడిపల్లి పంచాయతీలోని గండిపోశమ్మ ఆలయం పూర్తిగా నీటమునిగింది. గురువారం సాయంత్రం వరకూ ఆలయ గోపురం మినహా మిగిలిన ఆలయం అంతా నీటమునిగింది. వరద మరింత పెరగడంతో శుక్రవారం ఉదయానికి గోపురం చివర భాగం కేవలం ఒక్క అడుగు మాత్రమే కనిపిస్తూ పూర్తిగా మునిగిపోయింది. ఎగువప్రాంతాల్లో గోదావరి వరద నిలకడగా ఉన్నప్పటికీ గండిపోశమ్మ ఆలయం వద్ద వరద తగ్గే సూచనలు కనిపించడం లేదు.

నిలిచిన రాకపోకలు

కూనవరం: ఎగువున కురుస్తున్న భారీవర్షాలకు శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తడంతో కూనవరం, కొండ్రాజుపేట కాజ్‌వేపై రాకపోకలు రెండవ రోజు కూడా నిలిచిపోయాయి. గురువారం ఉదయం 11 గంటలకు కూనవరం, భద్రాచలం రహదారిపై పోలిపాక వద్ద వరదనీరు చేరండంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కూనవరం గోదావరి నీటిమట్టం 18.48 అడుగులు కాగా ఒక పాయింట్ తగ్గింది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వాగుల్లో తగ్గని వరద ఉధృతి

ఎటపాక: కొద్దిరోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుండటంతో వాగుల్లో ఉధృతి కొనసాగుతోంది. అటవీ ప్రాంతంలోని గెడ్డల నీరంతా చేరుతుండటంతో నందిగామ, తోటపల్లి, నెల్లిపాక, మురుమూరు వాగుల్లో జలకళ సంతరించుకుంది. ఉదయం నుంచి గోదావరి ప్రవాహం భద్రాచలం వద్ద నిలకడగా ఉంది. తోటపల్లి వాగు కన్నాపురం వద్ద ఉన్న అలుగుపై నుంచి పొంగి పార్లుతోంది. గిరిజనుల చేపల వేటతో సందడి నెలకొంది.

సమర్థవంతంగా ఎదుర్కొందాం

ఎటపాక: సమిష్టిగా పనిచేసి గోదావరి వరదలను **సమర్థవంతంగా** ఎదుర్కొందామని వరదల **ప్రత్యేక అధికారి** బాపన్న దొర సూచించారు. వరదల దృష్ట్యా ప్రజాప్రతినిధులు,అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పరిస్థితులను తెలుసుకున్నారు.వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రజాప్రతినిధులను కోరారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రెండు నెలల వరదల సమయంలో అధికారులు ప్రజాప్రతినిధులను కలుపుకుని గ్రామాల్లోనే ఉండాలని కోరారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లకు డీజిల్ సమకూర్చాలని, పునరావాస కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. ప్రత్యేక అధికారి బాపన్నదొర మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో వరదలను ఎదుర్కొందామని కోరారు. గ్రామాల్లోని వరద పరిస్థితులను ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ, ఎంఈవో సరియం రాజులు,ఏపీఎం స్వామి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భూసిపుట్టుకు నిలిచిన రాకపోకలు

ముంచంగిపుట్టు: మండలంలో గల భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గంలోతుడుమురాయి వద్ద ఉన్న కల్వర్టుపై నుంచి శుక్రవారం ఉదయం భారీగా వరదనీరు ప్రవహించింది. దీంతో భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి రాకపోకలు సుమారు 6గంటల పాటు నిలిచిపోయాయి. కల్వర్టుకు పక్కనున్న పంట పొలాలు కోతకు గురయ్యాయి.బుంగాపుట్టు,రంగబయలు,బాబుశాల,కుమడ పంచాయతీల్లో వాగులు వరదనీటితో ఉధృతంగా ప్రవహించాయి. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.



వడ్డిగూడెం–వడ్డిగూడెం కాలనీల మధ్య రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

అండగా ప్రభుత్వం

కూనవరం: గోదావరి వరదల పట్ల ప్రజలు ఆందోళన చెంద వద్దని, ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని కోతులగుట్టలో ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వరదబాధితుల పునరావాస కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. వరద బాధితులతో నేరుగా మాట్లాడారు. అక్కడున్న వారికి రేషన్ నిత్యావసరాలు తక్షణం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులను తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ, జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, తహసీల్దార్ కె అనసూయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి, కూనవరం ఎంపీటీసీ కొమ్మాని అనంత లక్ష్మి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి నోముల కొండలరావు, మహిళా ఉపాధ్యక్షురాలు కె.సునీత, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి భరతమూర్తి, పట్టణ అధ్యక్షుడు కొమ్మాని మోహన్ రావు, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



చింతూరు ప్రాంతంలో గోదావరి ఉధృతికి ఎగపోటుకు గురైన శబరినది



ముంచంగిపుట్టు మండలంలో తుడుమురాయి వద్ద కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



ఎటపాకలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి బాపన్నదొర



రేకపల్లిలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

స్పందనకు వినతుల వెల్లువ

ఐటీడీఏలో 101 అర్జీల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో అంబేడ్కర్ స్పందన ప్రజల నుంచి 101 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆయనతోపాటు ఐటీడీఏ పీవో ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ మురళి, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, టీడబ్ల్యూఈఈ డీవీఆర్‌ఎం రాజు, పీఆర్ ప్రాజెక్ట్సు ఈఈ లావణ్యకుమార్, గృహనిర్మాణ సంస్థ డీఈఈ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

● జిల్లా కేంద్రమైన పాడేరులో జువైనల్ హోం ఏర్పాటుచేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బాకా లవకుశ వినతిపత్రం అందజేశారు.

● పాడేరు పట్టణ పరిధిలోని పి.గొందూరు కాలనీకి తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఎంపీటీసీ చల్లా చిట్టమ్మ, స్థానికులు ప్రమీల,డి.రాజేశ్వరి కోరారు.

● పాడేరు మండలం వంజంగి పంచాయతీ నుంచి బొర్రామామిడికి తారురోడ్డు నిర్మించాలని గిరిజనులు విన్నవించారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో అంబేడ్కర్

● పాడేరు మండలం బొక్కెళ్లు సమీపంలో మత్స్య గెడ్డ కాజ్‌వే శిథిలమైందని, దీని స్థానంలో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గొండెలి గిరిజనులు కోరారు.

● ఇళ్లు మంజూరైందని, రుణ సదుపాయం కల్పించాలని హుకుంపేట మండలం పట్టాం పంచాయతీ, కోడితలకు చెందిన పాంగి ప్రసాద్ కోరాడు.

● పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ,కొత్తపోయిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానిక చర్యలు తీసుకోవాలని స్థానికులు మత్రి రాజారావు,పాంగి అప్పారావు వినతి పత్రం అందజేశారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

లెక్కలు తేల్చిన ఆంధ్రా–ఒడిశా అధికారులు

సీలేరు: బలిమెల జలాశయం నీటి వినియోగంపై శుక్రవారం ఆంధ్ర, ఒడిశా అధికారులు హైడ్రోపవర్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏపీ రాష్ట్రాలు తమ వాటాలుగా ఎన్ని టీఎంసీల నీటిని వినియోగించుకున్నారో లెక్కించారు. 2022–23 నీటి సంవత్సరంలో జూలై 2022 నుంచి జూన్ 2023 వరకు ఆంధ్రా తన వాటాగా 61.5106, ఒడిశా తన వాటాగా 47.7528 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్రాల అధికారులు లెక్క కట్టారు. దీని ప్రకారం ఇప్పటివరకు ఆంధ్రా, ఒడిశా కంటే 13.7578 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 17.8000 టీఎంసీలు, జోలాపుట్టులో 3.0162 టీఎంసీలు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఈనెలాఖరుకు బలిమెలో రెండు టీఎంసీలు, జోలాపుట్టులోఒక టీఎంసీ నీరు వచ్చి చేరుతుందని అంచనా వేశారు. దీని ప్రకారం బలిమెల, జోలాపుట్టులో కలిసి మొత్తం 23.8162 టీఎంసీలుగా లెక్కకట్టారు. ఇందులో ఆంధ్రా వాటా 5.0292 టీఎంసీలు, ఒడిశా వాటా 18.7870 టీఎంసీలుగా కేటాయించారు. ఈ నెలాఖరువరకు ఇరు రాష్ట్రాలు అవసరాల నిమిత్తం ఆంధ్రాకు రెండు వేల క్యూసెక్కులు, ఒడిశా 2100 క్యూసెక్కులు బలిమెట జలాశయం నుంచి వినియోగించుకునేందుకు ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది.



హైడ్రో పవర్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశమైన ఆంధ్రా- ఒడిశా అధికారులు

గడప గడపతో మమేకం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో పరిశీలించడమే కాకుండా గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా చేపట్టిన గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నాటికి అరకులోయ నియోజకవర్గంలో 200 రోజులు పూర్తిచేసుకుంది. ఈ కార్యక్రమం విజయవంతానికి ఎమ్మెల్యే పాల్గుణ ఎంతో శ్రమించారు. గెడ్డలు, నదులు, వాగులను దాటుకుంటూ మారుమూల గ్రామాలను సందర్శించారు. ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. చాలావరకు శాశ్వతంగా పరిష్కరించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంలో తనవంతు పాత్ర పోషించారు.



కాశీపట్నం గ్రామ సచివాలయం పరిధిలోని సారవానిపాలెం ప్రాంతంలో గెడ్డను దాటుకుని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు (ఫైల్)

- 'గడపకు గడపకు మన ప్రభుత్వం' 200 రోజులు పూర్తి
- కార్యక్రమం విజయవంతానికి శ్రమించిన ఎమ్మెల్యే పాల్గుణ
- సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి
- నెరవేరుతున్న ప్రభుత్వ లక్ష్యం

అనంతగిరి: అరకు నియోజకవర్గంలోని మండలాల్లో ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల ఎన్నో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైంది. సుమారు 1624 గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించి స్థానిక సమస్యలు పరిష్కరించారు. అర్హులకు పథకాలు అందేలా చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆశయ సాధన నెరవేర్చేందుకు కృషి చేశారు.

● అరకు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 135 పంచాయతీల పరిధిలో 115 గ్రామ సచివాలయాలు ఉండగా వీటిలో 88 సచివాలయాల్లో 200 రోజుల్లో 1624 గ్రామాల్లో నిర్వహించారు. 57,237 గడపలను సందర్శించారు.

● గిరిజన ప్రాంతంలో ఒకొక్క గ్రామసచివాలయానికి గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది.

● ఇప్పటికి 30 గ్రామ సచివాలయాల పరిధిలో రూ.12 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీలు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తికాగా మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ (ఫైల్)

పరిష్కరించిన సమస్యలు

● ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పెదబయలు మండలంలోని జామిగుడ గ్రామ సచివాలయం పరిధిలో జామిగుడ గిరిజనులు తీసుకువచ్చిన సమస్యలను ఎమ్మెల్యే పాల్గుణ పరిష్కరించారు.

● పెదబయలు రోడ్డు నుంచి జామిగుడ, రూడకోట, కుమడ ప్రాంతంలో రూ.13.21 కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

● ఒడిశా సరిహద్దు నుంచి కెందుగూడ వరకు రూ. 3.85 కోట్లతో రోడ్డు నిర్మాణ దశలో ఉంది. ఈ పనులు పూర్తయితే ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో 20 గ్రామాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

● పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ జంగంపుట్టు నుంచి ఇంజరి మీదుగా కొండ్రు వరకు ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ నిధులు రూ.3.85 కోట్లతో ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగుతోంది.

తప్పిన అవస్థలు

హుకుంపేట మండలంలోని తీగలవలస పంచాయతీ అమూరు గ్రామానికి వెళ్లే గెడ్డపై ఎస్‌ఎస్‌పి నిధులు రూ.45 లక్షలతో వంతెన నిర్మించారు. దీని వల్ల సుమారు పది గ్రామాలకు వర్షాకాలంలో అవస్థలు తప్పాయి.

● హుకుంపేట మండలం కోట్నాపల్లి పంచాయతీ పందిమెట్ట గ్రామ సమీపంలోని గెడ్డపై ఎస్‌సీపీ నిధులు రూ.35లక్షలతో వంతెన నిర్మించడం వల్ల సుమారు 20 గ్రామాలకు ప్రయోజనం చేకూరింది.

● అనంతగిరి మండలంలోని సారవానిపాలెం గోస్తనీ నదిపై ఎస్‌సీపీ నిధులు రూ.2 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సుమారు 10 గ్రామాల గిరిజనులకు అవస్థలు తప్పనున్నాయి.

సమస్యలు పరిష్కరించగలిగాం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోలిగాం. అర్హత ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి మంజూరుకు చర్యలు తీసుకున్నాం. ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన రరూ.40 లక్షల నిధులతో గ్రామస్థాయిలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాం. వంతెనల సౌకర్యం అందుబాటులో వస్తుండటంతో మారుమూల గ్రామాల గిరిజనుల్లో ఎంతో ఆనందం కనిపించింది.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు నియోజకవర్గం

క్లుప్తంగా

నేడు జీసీసీ చైర్‌పర్సన్ రాజవొమ్మంగి రాక

రాజవొమ్మంగి: జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి శనివారం రాజవొమ్మంగి వస్తున్నట్లు జీసీసీ స్థానిక మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. ఆమె తొలుత జడ్డంగిలో నిర్మించనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలిస్తారన్నారు. అనంతరం కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం అవుతారని ఆమె పేర్కొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి 4న రాత పరీక్ష

అరకులోయ రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాల (బాలురు)లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతిలో 30, ఆరవ తరగతిలో ఆరు సీట్ల భర్తీకి జోనల్ స్థాయిలో రాత పరీక్షలు వచ్చే నెల 4న నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. క్రీడా పాఠశాలలో పరీక్ష జరుగుతుందన్నారు.

సూపరింటెండెంట్‌గా రాహుల్‌కు పూర్తి బాధ్యతలు



వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాహుల్ పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆయనను ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు.

నవరత్నాలతో ప్రజలకు వెలుగు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే హైమావతి తదితరులు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- 'గడప గడపకు మన ప్రభుత్వం' 200 రోజుల పూర్తి
- అరకు నుంచి సొవ్వ వరకు కార్లు, బైక్‌ల ర్యాలీ

డుంబ్రిగుడ: నవరత్నాలతోనే ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. అరకు నియోజక వర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం ఆంధ్ర–ఒడిశా సరిహద్దు సొవ్వ పంచాయతీలోని రంగినివలస, మాలివలస, సొవ్వ గ్రామాల వరకు అరకులోయ నుంచి కార్లు, ద్విచక్రవాహనాలతో 39 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పూలదండలతో స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. పూలవాన కురిపించారు. అనంతరం ఎమ్మెల్యే, విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి నవరత్నాల పథకాలు,సంక్షేమ పథకాల వివరాలను, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టిన 200 రోజుల్లో 88 గ్రామ సచివాలయాల పరిధిలో 57,257 గడపలను సందర్శించామన్నారు. ప్రజలనుంచి తెలుసుకున్న సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం ముందు ఉందన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థపై అవగాహన లేకపోవడం వల్లే విమర్శలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కేవలం జగన్ ప్రభుత్వంలో మాత్రమే గిరిజన ప్రాంతానికి అన్నివిధాలుగా న్యాయం జరుగుతోందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యయక్రమంలో ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి గంగధరస్వామి,రాష్ట్ర యువజన కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీ భర్త శివకుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, రామన్న, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సాద్రు, సచివాయ మండల కన్వీనర్లు గణపతి ,సంపత్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు శాంతి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం పారదర్శకంగా అమలుచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అరకు నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో అరకులోయలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా పట్టణంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అధిష్టానం మేరకు పార్టీ మరింత బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సీఎం జగనన్న పాలనలో శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలోనే సాధ్యమవుతోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. సుపరిపాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అమలుచేస్తూ నిజాయితీకి మారుపేరుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఎంపీపీ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరీ, మండల పార్టీ అధ్యక్షుడు గాసి, నాయకులు ముఖి సాంబ, నగేష్ , నర్సింగ్, రామన్న, వెంకటరావు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డులో కందమామిడి జంక్షన్ వద్ద రవాణాకు సిద్ధం చేసిన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రంజిత్ కుమార్ తెలిపారు.కందమామడి జంక్షన్‌లో ముగ్గురు గంజాయితో ఉన్నారనే సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి 10 కిలోల గంజాయి,మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుల్లో ఒకరు తమిళనాడు వాసి కాగా, మిగతా ఇద్దరు ఇద్దరు ఏజెన్సీకి చెందినవారని, వీరిలో ఒక యువతి కూడా ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు.నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్‌ఐ రంజిత్‌కుమార్, పోలీసు సిబ్బంది

వరద బాధితులు అధైర్య పడొద్దు

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

వీఆర్‌పురం: వరద బాధితులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్(బాబు) అన్నారు. వీఆర్‌పురం మండలంలోని వరద ప్రభావిత గ్రామం వడ్డిగూడెం కాలనీలో శుక్రవారం వారు పర్యటించారు. నిర్వాసితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో ఉండేందుకు వీలుగా టార్పాలిన్లు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరారు. పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకు అందించాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేలా అధికారులను ఆదేశించామని వారు చెప్పారు. వడ్డిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పుల్లెందెల నాగమణి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును అందజేశారు. తమ గ్రామాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చి తమకు నష్టపరిహారం ఇప్పించాలని రేఖపల్లి గ్రామస్తులు వారిని కోరారు. ప్రస్తుతం తొలిప్రాధాన్యతగా గుర్తించిన గ్రామాల సర్వే ప్రక్రియ పూర్తి అయిన వెంటనే రేఖపల్లి లాంటి గ్రామాల్లో కూడా సర్వే ప్రక్రియ చేపట్టే అవకాశం ఉందని వారు వెల్లడించారు. అలాగే తొలిప్రాధాన్యత గ్రామాల్లోని నిర్వాసితులకు తొలివిడతగా స్ట్రక్చర్ ప్యాకేజీ ఇవ్వడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, తహసీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపీడీవో రత్నకుమారి, ఎస్‌ఐలు తెల్లం దుర్గాప్రసాద్,బి.వెంకటేష్, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు సోడెం నరసమ్మ, పిట్టా రామారావు, సెక్రటరీ స్వరూప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ముత్యాల శ్రీనివాస్,మాచర్ల గంగులు,ముత్యాల మురళి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు పాల్గొన్నారు.



వడ్డిగూడెంలో నాగమణి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

విధులకు డుమ్మా కొడితే చర్యలు

కొయ్యూరు: విధులకు డుమ్మా కొట్టే ఉపాధ్యాయులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో బోడంనాయుడు హెచ్చరించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించకపోతే కలెక్టర్ ఆదేశాల మేరకు సరెండర్లు తప్పవన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు విధులు చేయాలన్నారు. జేవీకె కిట్ల పంపిణీలో పూర్తిగా తల్లిదండ్రులు లేదా విద్యార్థితో బయోమెట్రిక్ వేయించాలని ఆదేశించారు. ఇప్పటికి 82 శాతం పూర్తయిందని, మిగిలిన 18 శాతం పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని కోరారు. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

సాగు భూముల జోలికి వస్తే ఖబడ్దార్!

- విజయనగరం రాజులకు గిరిజనుల హెచ్చరిక
- పాడేరు ఐటీడీఏ ఎదుట ఆందోళన

సాక్షి,పాడేరు: పూర్వం నుంచి తమ సాగులో ఉన్న భూముల జోలికి విజయనగరం రాజులు వస్తే ఉపేక్షించమని తిరుగుబాటుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అనంతగిరి మండల గిరిజనులు హెచ్చరించారు. అనంతగిరి, టోకూరు, కొండిబ, ఎగువ శోభ పంచాయతీల పరిధిలోని గిరిజనులు శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరులో ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ఎదుట ధర్నా చేశారు. విజయనగరం మహారాజులు ఐదవ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టానికి విరుద్ధంగా తమ సాగు భూములను బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారికి రెవెన్యూ అధికారులు కూడా సహకరించడం అన్యాయమంటూ నినాదాలు చేశారు. అనంతగిరి జడ్పీటీసీ డి.గంగరాజు, గిరిజన సంఘం నేత పి.బాలదేవ్ మాట్లాడుతూ 361.83 ఎకరాల భూములను గిరిజనులంతా తాతముత్తాతల నుంచి సాగు చేస్తున్నారన్నారు. ఈ భూములను కాజేయాలనే దురుద్దేశంతో విజయనగరం రాజులు సుప్రీంకోర్టును ఆశ్రయించడమే కాకుండా ,అధికారులను ప్రభావితం చేస్తున్నారన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు జిరాయితీ, డి.పట్టాలు, అటవీ హక్కుల చట్టం కింద కూడా హక్కు పత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలకు తూట్లు పొడిచే విధంగా విజయనగరం రాజులు గిరిజనుల భూములను కాజేసే కుట్రలను ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకుని గిరిజనులకు న్యాయం చేయాలని వారు కోరారు. గిరిజనులకు న్యాయం చేయాల్సిన అధికారులు, అనంతగిరి తహసీల్దార్ కూడా విజయనగరం రాజులతో షేర్ మాట్లాడుకోవాలని చెప్పడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయం చేస్తాం: ఐటీడీఏ పీవో అభిషేక్

గిరిజన చట్టాలు, హక్కుల ప్రకారం ఇక్కడ భూములన్నీ గిరిజనులకే చెందుతాయని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ద్వారా సమగ్ర విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేస్తామని ఐటీడీఏ పివో వి.అభిషేక్ ఆందోళనకారుడలకు హామీ ఇచ్చారు. గిరిజన సంఘ నేతలు ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు సర్వే జరుపుతామని, పట్టాలు కూడా మంజూరు చేస్తామన్నారు. అవసరమైతే ప్రభుత్వం ద్వారా రిట్ పిటిషన్ దాఖలు చేస్తామని పీవో చెప్పడంతో వారంతా తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. అనంతరం ఎస్‌డీసీ శర్మ ఆందోళన కారుల నుంచి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కిల్లో మోస్యా, కుర్ర సింహాద్రి, గిరిజన సంఘ నేతలు సివేరి కొండలరావు, పాలికి లక్కు, సుందరరావు, సార దున్ను, సుబ్బారావు, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.



పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న అనంతగిరి మండలంలోని గిరిజనులు



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌డీసీ శర్మ

మణిపూర్ ఘటనపై నిరసన

అల్లరి మూకలపై చర్యలకు డిమాండ్



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా, గిరిజన సంఘ నేతలు

సాక్షి,పాడేరు: మణిపూర్‌లోని ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి అతి కిరాతంగా సాముహిక అత్యాచారానికి పాల్పడిన అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో పలు సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం పాడేరు ర్యాలీ చేపట్టాయి. స్థానిక ఐటీడీఏ ఎదుట నిరసన తెలిపాయి. ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమావతి మాట్లాడుతూ దారుణ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు, మహిళా సంఘాల నేతలు ఈశ్వరి,సుబ్బలక్ష్మి, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి శంకరరావు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు/రంపచోడవరం: మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక దాడికి పాల్పడడాన్ని వ్యతిరేకిస్తూ పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లో ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, గిరిజన, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలను నిరోధించాలని నినాదాలు చేశారు. నేతలు రామారావుదొర, శేషాద్రి, శ్రీనివాసపడాల్, శ్రీరాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివకిరణ్

సాక్షి,పాడేరు: విద్యార్థి దశనుంచే బాలికలంతా హక్కులు, చట్టాలు,న్యాయవ్యవస్థపై అవగాహన పొందాలని, పాడేరు ప్ర మ శ్రేణి జ్యూడిషియల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎం.శివకిరణ్ సూచించారు. కుమ్మరిపుట్టులోని ఏపీఆర్ కళాశాలను శుక్రవారం న్యాయమూర్తి సందర్శించారు. న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు.బాలికలు ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. ఏపీపీ రమేష్, మండల న్యాయసేవాధికార సభ్యుడు ప్రసాదనాయుడు, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

సీలేరు: సీలేరు గ్రామానికి చెందిన కిల్లో సరోజిని, బండారు రామారావు, పిల్లి శాంతమ్మ, బండారు లక్ష్మికి రెండు నెలలుగా పింఛన్ పంపిణీ చేయకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామ వలంటీర్ బాబులాల్ విధుల నుంచి తొలగించారని, అలాగే మరో వలంటీర్ గోపినాథ్ రాజీనామా చేసినట్టు సర్పంచ్ వల్లి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సామమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్‌ను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.



బాధితులకు పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

వచ్చే నెల 30న జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శన

చోడవరం: ఆరో జాతీయస్థాయి చిత్రకళా పోటీ ప్రదర్శనను చోడవరంలో ఆగస్టు 30వ తేదీన ఏర్పాటు చేసినట్లు చిత్రకళా నిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ చెప్పారు. చిత్ర కళా ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను చోడవరం ప్రేమసమాజం ఆవరణలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే చిత్రకారులు తమ చిత్రాలను ముందుగా నమోదు చేసుకోవాలని సూర్యనారాయణ కోరారు. ప్రవేశ రుసుము, ఇతర వివరాలకు చోడవరం చిత్రకళా నిలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, టీవీ రమణ, కన్నయ్య శెట్టి, తిరుపతిరావు, కృష్ణ పాల్గొన్నారు.

ఏపీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ఉచిత కోచింగ్

సాక్షి,పాడేరు: ప్రభుత్వం,సాంఘిక సంక్షేమశాఖ ఆధీనంలోని ఏపీ స్టడీ సర్కిల్ నిర్వహణలో రాష్ట్రంలో పలు చోట్ల సివిల్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ,ఎస్టీ,ఇతర కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఆగస్టు 5వతేదీ లోగా httpr://apstdc.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు విశాఖపట్నంలోను, ఏపీపీఎస్సీ గ్రూప్–1కు విజయవాడలోను, గ్రూప్–2కు తిరుపతిలోను ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన,ఎదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం రూ.6లక్షలకు మించకూడదని, వయోపరిమితి 21 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు.ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు గరిష్ట వయో పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.ప్రవేశ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు ఉచిత కోచింగ్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు.